సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 19 । నవంబర్ । 2023

ఆమె..అంతంతే
- సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో బరిలో 27 మందే..
- పురుషులు 188 మంది..
- మొత్తం 215 మంది పోటీకి సై

- 10లో▸



ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి
విద్యార్థినులు అవసరమైన ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు.

- 11లో▸

గరిష్టం/కనిష్టం
33⁰/20⁰

వాతావరణం
జిల్లాలో వాతావరణం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఓటు హక్కును వినియోగించుకోవాలి
- అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



మహబూబాబాద్: ఓటు హక్కును సామాజిక బాధ్యతగా గుర్తుంచుకుని అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బెలూన్‌లను అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. వంద శాతం పోలింగ్ నమోదుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్యా, డీపీఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం పరిశీలన



మహబూబాబాద్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఎలా జరుగుతుందని పరిశీలించేందుకు కర్ణాటక రాష్ట్ర సాంఘిక సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ ఎస్ తంగిడిగి జిల్లా కేంద్రానికి శనివారం వచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయనను ఆహ్వానించారు. అనంతరం మంత్రి నియోజకవర్గంలో ఉన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, జెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, రాయల కృష్ణమూర్తి, పూజారి వెంకన్న, సురుగు రంగన్న, కొత్త హేమంత్, మిట్టకంటి నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి



డోర్నకల్: డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అంబరీష ఆదేశించారు. మండలంలోని మన్నెగూడెం, ముల్కలపల్లి, తొడేళ్లగూడెం పల్లె దవాఖానలను శనివారం డాక్టర్ అంబరీష తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందులు, సేవల గురించి విచారించారు. అనంతరం డోర్నకల్ పీహెచ్‌సీలో సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాద్విజ, వైద్యురాలు డాక్టర్ కనకదుర్గ, సీహెచ్‌ఓలు వీరబాబు, మల్లికార్జున్, ఎస్‌యూఓ వడ్డె శ్రీనివాస్, డీపీఓ రుకుముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాలకు సమయపాలన పాటించాలని జిల్లా విద్యా శాఖ అధికారి పి. రామారావు అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పూసపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను శనివారం డీఈఓ పి.రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు,భోజనం అందిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నెల సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యపై వివరించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, గోవర్ధన్, పద్మ, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 11 నుంచి శిక్షణ తరగతులు

కేయూ క్యాంపస్: కేయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1 నుంచి నిర్వహించనుండగా.. తేదీల్లో మార్పులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చిన్నలీడర్ల పెత్తనం!

ఎన్నికల్లో వారిదే హవా
- అన్నిచోట్లా ఆధిపత్యం చెలాయిస్తున్న నాయకులు
- మాపై మీ అజమాయిషీ ఏంటని సీనియర్ల ప్రశ్న
- విలువ లేకుండా పోతుందని నిరాశ
- ఎన్నికల సమయంలో లొల్లి!



సాక్షి, మహబూబాబాద్: ఒక వైపు ఎన్నికల సమయం దగ్గర పడుతుంది. జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో అన్ని పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు ఉండటంతో ఎవరి ఓట్లు ఎవరికి పడుతాయో అనే అయోమయంలో అభ్యర్థులు ఉంటే.. సందెట్లో సడేమియా అన్నట్లు చిన్న లీడర్ల పెత్తనం పార్టీ పెద్దలకు, అభ్యర్థికి పెద్ద తలనొప్పి తెచ్చిపెట్టేదిగా మారిందని ప్రచారం జరుగుతుంది. ఎప్పటి నుంచో పార్టీని పట్టుకొని ఉన్నాం.. ఏం ఆశించకుండానే పార్టీ కోసం పనిచేస్తున్నాం.. అటువంటి మాపై మా కొడుకు వయస్సు కూడా లేని నాయకుల పెత్తనం ఏంటని సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కీలక సమయంలో ఎవరిని ఏం అంటే.. ఏం జరుగుతుందోననే ఆలోచనలో అభ్యర్థులు ఉన్నారు.

ఇలా అయితే కష్టమే..

ఎన్నో ఎన్నికలు చూశాం. పార్టీ కోసం పనిచేసి అభ్యర్థులను గెలిపించుకున్నాం.. ఇప్పుడు వచ్చిన వారు మాపై పెత్తనం ఏంటని పలువురు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు పార్టీ పెద్దల ముందు అసహనం వ్యక్తం చేయడం.. ఇలా అయితే పనిచేయడం కష్టమే అన్న సంకేతాలు కూడా ఇచ్చినట్లు ప్రచారం. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది పార్టీ కరపత్రాలు మొదలుకొని.. జెండాలు, పోస్టర్లు కూడా తమకన్న చిన్న నాయకుడి వద్దకు వెళ్లి అడుక్కోవాల్సి వస్తుందని నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పుడే ఇలా ఉంటే రేపు డబ్బుల పంపిణీ విషయంలో కూడా తమను పక్కన పెట్టి పెత్తనం చేసే అవకాశం ఉందని, అప్పుడు మా ప్రాంతాల్లో మా ఉనికికే ప్రమాదం ఉంటుందనే ఆలోచనతో సదరు నాయకులు ఉన్నారు. అందుకోసమే కొందరు ప్రచారం చేయకుండా మౌనంగా ఉంటున్నారని, మరికొందరు పార్టీలు కూడా మారిన సందర్భాలు ఉన్నాయని జిల్లాలో చర్చ. ఇటువంటి పరిస్థితిలో అటు యువ నాయకులను హెచ్చరించలేక.. అలాగని సీనియర్లను చిన్నచూపు చూడలేక అభ్యర్థులు సతమతం అవుతున్నారు. అయితే ఇది కాస్త తీవ్రతరం అయితే మాత్రం ఓటు బ్యాంకుకు గండి పడే ప్రమాదం ఉందనే సంకేతాలు వస్తున్న నేపథ్యంలో ఈ కొద్దిపాటి సమయంలో అభ్యర్థి ఎలా వ్యవహరిస్తారో.. ఎవరిని సర్దిచెబుతారో.. అనేది జిల్లాలో చర్చగా మారింది.

వారు చెప్పిందే వేదం..

జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లోని పలు పార్టీల్లో చిన్న లీడర్లు చెప్పిందే వేదంగా మారింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా యాత్, ఇతర నాయకులతో నాయకులు హల్‌చల్ చేయడం.. అంతా తామై నడిపిస్తున్నట్లు షో చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా ప్రచారం కోసం ఏర్పాటు చేసిన వాహనాలు, ఇతర ప్రచారం సందర్భంగా నాయకుల పర్యటనకు ఆయా నాయకుడు చెప్పిందే వేదంగా నడుస్తుందని ఆయా పార్టీల్లోని నాయకులు చెబుతున్నారు. దీంతో వారు చెప్పిన వార్డులు, గ్రామాల్లోనే అభ్యర్థుల తోపాటు, పెద్ద నాయకులు కూడా పర్యటనలు చేస్తున్నారు. ఇదేంటి అని ప్రశ్నిస్తే.. మా ప్రాంతంలో ఎక్కువ మంది సమీకరిస్తున్నాం .. అందుకోసమే తిప్పుతున్నామని చెబుతున్నారని అంటున్నారు. అంతటితో ఆగకుండా.. వారి ప్రాంతాల నుంచి ఇప్పుడు ఇతర నాయకులు ఉన్న ప్రాంతాలకు వెళ్లడం, అక్కడ కూడా పెత్తనం చేయడంతో సీనియర్లు నొచ్చుకుంటున్నారు. ఈ విషయంపై పలు ప్రాంతాల్లో పంచాయితీలు, గొడవలు జరగడం, అది కాస్త అభ్యర్థితోపాటు, ఆయా పార్టీల ఇన్‌చార్జీలకు, పెద్ద నాయకులకు కూడా చెప్పి సదరు నాయకులు బాధపడినట్లు తెలిసింది.

కమలంలో ఖుషి..

ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- బీఆర్‌ఎస్ టార్గెట్‌గా సాగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగం
- కేసీఆర్ అవినీతి పెరిగిపోయిందని, కక్కిస్తామని వ్యాఖ్యలు..
- కేంద్రం కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలపై వివరణ
- వరంగల్ ఎంజీఎంకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ
- డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే మరింత అభివృద్ధి
- వరంగల్ పుణ్య భూమిపై అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడి



ఖిలా వరంగల్ మైదానంలో జరిగిన బీజేపీ ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) నమస్కరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ఖిలా వరంగల్: ఎన్నికల ప్రచారం మొదలయ్యాక తొలిసారి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వరంగల్‌కు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఖిలా వరంగల్ మైదానంలో శనివారం జరిగిన బీజేపీ ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభకు జనం నుంచి భారీగా స్పందన రావడంతో ఆ పార్టీ నాయకులు ఖుషీలో ఉన్నారు. అమిత్‌షా ప్రసంగం మొత్తం బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తూ.. కేంద్ర సంక్షేమంపై సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. సభ ప్రారంభానికి ముందే భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అమిత్ షా నేరుగా కాన్వాయ్‌లో సభా మైదానానికి చేరుకున్నారు. వేదికపైకి చేరుకుని హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులను పరిచయం చేసి ప్రసంగం మొదలుపెట్టారు. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి జరుగుతుందని, అవకాశం ఇస్తే బీసీని సీఎం చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీని గెలిపిస్తే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని చెప్పగా, సభకు వచ్చిన జనం చప్పట్లు, కేరింతలతో ప్రాంగణమంతా మార్మోగింది. ఓరుగల్లుకు గొప్ప చరిత్ర ఉందని, కాకతీయుల కళారాజ్యంలో భద్రకాళి, రామప్ప లాంటి ఎన్నో పవిత్రమైన పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, అటువంటి పుణ్య భూమిపై అడు గు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ ప్రజల ప్రగతి కోసం ఎంతో చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావు పద్మ, డాక్టర్ కాళీప్రసాద్‌రావు, కొండేటి శ్రీధర్, కంభంపాటి పుల్లారావు, కీర్తిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.




వరంగల్ తూర్పు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రదీప్‌రావును గెలిపించాలని కోరుతున్న అమిత్‌షా

కేసీఆర్ పాలనపై విమర్శల వెల్లువ

పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నాశనం చేశారని అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. సర్వ సంపన్న తెలంగాణను సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి, కుంభకోణాలతో అప్పులకుప్పగా మార్చారని దుమ్మెత్తి పోశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయలో అవినీతి, అతిపెద్ద కుంభకోణం జరిగిందని, ఇలా లెక్కబెట్టాలంటే వారం రోజులు పడుతుందని ఆరోపించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఎలుకలు కొరికి రోగి చనిపోయినా పట్టింపులేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రూ.వేల కోట్లు కేటాయించి అభివృద్ధిలో వరంగల్‌ను ముందుంచుతామని హామీ ఇచ్చారు. ఎడ్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్, కుసుమ సతీష్, గంట రవికుమార్, అల్లం నాగరాజు, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..
- సాయంత్రం 4.20 గంటలకు హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు రాక
- 4.32 గంటలకు: ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ సభ వద్దకు ..
- 4.36 గంటలకు : ప్రసంగం ప్రారంభం.
- 4.54 గంటలకు: ప్రసంగం ముగింపు
- 4.55 గంటలకు: ఎయిర్‌పోర్ట్‌కు వాహనంలో బయల్దేరిన అమిత్ షా
- 5.10 గంటలకు : ఎయిర్‌పోర్ట్‌నుంచి హైదరాబాద్‌కు పయనం

తూర్పును గూండాల నుంచి కాపాడాలి : బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు



వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని గూండాల రాజ్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తూర్పు అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఆజంజాహి మిల్లును అమ్మి, సెంట్రల్ జైలును కుదువపెట్టినందున వరంగల్ ప్రజలు, యువతకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని డ్రెయినేజీలు, నాలాలు ఆక్రమణకు గురికావడంతో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ అభివృద్ధి చేయడమే కాకుండా కేంద్రం నుంచి భారీ పరిశ్రమలను తీసుకువస్తామని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

ఓటరు స్లిప్పులు అందించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శశాంక

మహబూబాబాద్ రూరల్: ప్రతి ఓటరుకు సమాచార ఓటరు స్లిప్పులు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మహబూబాబాద్ మండలంలోని ఆమనగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శనివారం సందర్శించి పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎల్‌ఓను పిలిచి ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. ఓటర్ స్లిప్పులను నేరుగా ఓటరుకే ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ వీల్ చైర్లు, ర్యాంపులు, నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. వెబ్ కాస్టింగ్ ఉన్నందున సీసీ కెమెరాలు ఏర్పాటుకు త్రీ పిన్ ప్లగ్గును కూడా ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్, సహాయ రిటర్నింగ్ అధికారి భగవాన్ రెడ్డి, ఎంపీడీఓ, సెక్టోరియల్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే హైస్కూల్ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు అలసత్వం వహించొద్దని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి, ధన్నసరి గ్రామాల్లో డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రమేష్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే రైతుల బతుకులు ఆగమే



వెంకటాపురంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మడూరులో ప్రచారానికి ర్యాలీగా వస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

- కొట్లాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను గెలిపించాలి
- బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్/రాయపర్తి/దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులతోపాటు అన్నివర్గాల ప్రజల బతుకులు ఆగమవుతాయని బీఆర్‌ఎస్ పార్టీ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆయన శనివారం తొర్రూరు మండలంలోని గుడిబండతండా, నాంచారిమడూరు, పెద్దమంగ్యాతండా, టీక్యాతండా, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, అరిపిరాల, కర్కాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు బోనాలు, బతుకమ్మలు, డప్పుచప్పుళ్లు, కోలాటాలు, నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ తన పాలనలో తెలంగాణ ప్రాంతాన్ని సర్వనాశనం చేసిన కాంగ్రెస్ పార్టీ మరొక్కసారి అవకాశం ఇవ్వాలని అడగడం సిగ్గుచేటు అని అన్నారు. ఇలాంటి పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

కేసీఆర్ ఉంటేనే తెలంగాణకు రక్ష..

ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎంగా ఉంటేనే తెలంగాణ రాష్ట్రానికి రక్షగా ఉంటుందని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ఎంతో అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ సర్కారు.. మరోసారి అధికారంలోకి వస్తే ప్రజలకు ఎలాంటి జబ్బు వచ్చినా, ప్రమాదాలు జరిగినా రూ.15 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, నలమాస ప్రమోద్‌గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



దయాకర్‌రావును ఎత్తుకున్న కార్యకర్తలు

సైనికుల్లా పనిచేయాలి

రాయపర్తి: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో మంత్రి కుమారుడు ఎర్రబెల్లి ప్రేమ్‌చందర్‌రావుతో కలిసి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలను కంటికి రెప్పలాకాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రాయపర్తి మండలం ఊకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బండపల్లి భిక్షపతి, జేతురాంతండా ఉపసర్పంచ్ జాటోతు అనిల్.. బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తమదేనని, దయాకర్‌రావును గెలిపించుకోవాలని ఈ సందర్భంగా గోపాల్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, సర్పంచ్ నేతావత్ కిషన్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, నాగపురి రాంబాబు, ఉందాటి సతీష్, మచ్చ లక్ష్మీనారాయణ, ఎండీ.నయీం, తాడుశెట్టి రామారావు, రావుల వెంకట్‌రెడ్డి, రవినాయక్, మచ్చ శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చింతకింది శ్రీహరికి కండువా కప్పుతున్న ఎర్రబెల్లి

ఎర్రబెల్లి సమక్షంలో..

దేవరుప్పుల మండలం మున్‌పహాడ్‌కు చెందిన వైఎస్సార్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ బంగారు తెలంగాణ కేసీఆర్ సారథ్యంలోనే సాధ్యమవుతుందని, అందుకే పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్‌రెడ్డి, శీల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..

- ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఓటు హక్కు పొందిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె శశాంక అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ శశాంక మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు, అభ్యర్థుల తరఫున ప్రచారం చేసే నాయకులు ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమన్వయంతో పని చేసి సమష్టి నిర్ణయాలతో ముందుకు పోవాలన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో సిబ్బందికి మరోసారి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.1.20కోట్ల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గుడుంబా తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. చెక్ పోస్ట్‌ల ద్వారా ప్రతి వాహనం తనిఖీ చేస్తున్నామన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ భక్తిని చాటుకోవాలి

యువత ఓటు హక్కును వినియోగించుకుని నవ సమాజాన్ని నిర్మించుకునేలా దేశ భక్తి చాటుకునే సమయం ఆసన్నమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్వీప్ కప్ కార్యక్రమంలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక పాల్గొని క్రీడల్లో గెలుపొందిన యువకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, అధికారులు పాల్గొన్నారు. అలాగే కళా ఉత్సవంలో జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ కె శశాంక అభినందించారు.



అంతులేని అభిమానం..

ఖిలావరంగల్ వాకర్స్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వరంగల్ పెరుకవాడకు చెందిన ఓ బీజేపీ నేత వినూత్నంగా హాజరయ్యాడు. బైక్‌కు పదుల సంఖ్యలో పార్టీ జెండాలు ఏర్పాటు చేసి అందరిని ఆకర్షించాడు. – ఖిలా వరంగల్



చకోడి చేస్తా..'చేయి' కలుపు..

కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భార్య అరుణ శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లి బజ్జీ, చకోడిలు చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – బచ్చన్నపేట



మల్లా.. 'చల్లా'నే గెలిపించాలి..

బీఆర్‌ఎస్ పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల షాపు వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ చల్లానే గెలిపించాలని అభ్యర్థించారు. – ఆత్మకూరు



దర్జీ..నాయక్

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ షాపులో దుస్తులు కుట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – మహబూబాబాద్

జంగ్ తెలంగాణ

ఆమె.. అంతంతే

విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా వివిధ రంగాల్లో మహిళలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నారు. తమకు లభించిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ పురుషులకు దీటుగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే అవగాహన లేకనో.. అవకాశం రాకనో కాని రాజకీయ కదన రంగంలో మాత్రం అంతంత పాత్రే పోషిస్తున్నారు. దీనికి నిదర్శనమే ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 188 మంది పురుష అభ్యర్థులు పోటీపడుతుండగా 27 మంది మహిళలు మాత్రమే బరిలో నిలిచారు. దీంతో రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో బరిలో 27 మందే ..
- పురుషులు 188 మంది..
- మొత్తం 215 మంది పోటీకి సై



రావు పద్మ(బీజేపీ) సురేఖ(కాంగ్రెస్) సీతక్క(కాంగ్రెస్) నాగజ్యోతి(బీఆర్ఎస్) కీర్తిరెడ్డి(బీజేపీ)



యశస్విని(కాంగ్రెస్) సంగీత(బీజేపీ) ఇందిర(కాంగ్రెస్)

హన్మకొండ: రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మహిళలు బరిలోకి దిగారు. 12 నియోజక వర్గాల్లో ఒక్కటి మినహా 11 స్థానాల్లో బ్యాలెట్ పోరులో నిలిచారు. ప్రధాన పార్టీ అభ్యర్థులుగా, రిజిస్టర్ పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 29,74,564 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 15,05,252 మంది ఉండగా, పురుష ఓటర్లు 14,68,845 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 467 మంది ఉన్నారు. 36,407 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 215 మంది ఎన్నికల బరిలో నిలించారు. ఇందులో 188 మంది పురుషులుండగా 27 మంది మాత్రమే మహిళలు పోటీ చేస్తున్నారు. జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు ఎన్నికలో ఆ మేరకు ప్రాధాన్యం, ప్రాతినిధ్యం లభించడం లేదు. పోటీ చేసిన అభ్యర్థుల్లో 12.6 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్‌ఎస్ నుంచి ఒక్కరు పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకున్నారు. మిగతా మహిళా అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. కాగా పరకాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు. 11 నియోజకవర్గాల్లో మాత్రమే మహిళా అభ్యర్థులు నామినేషన్లు వేసి చివరికంటూ పోటీలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ చిత్రపు పష్పలత లయ పోటీ చేస్తున్నారు.

- **వరంగల్ పశ్చిమ** నియోజకవర్గంలో బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు మహిళలు ఉన్నారు. బీజేపీ నుంచి రావు పద్మ, ధర్మసమాజ్ పార్టీ నుంచి కోగిల రూప ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- **వరంగల్ తూర్పు** నియోజకవర్గం నుంచి ఎన్నికల రణరంగంలో 29 మంది పోటీ పడుతున్నారు. ఇక్కడ ఆరుగురు మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి కొండా సురేఖ, స్వతంత్రులుగా జన్ను ప్రమీల, పల్లకొండ మహేశ్వరి, పోలేపాక చంద్రకళ, భవంతుల రాధిక, జోగు శ్వేత ఉండగా ఇక్కడి నుంచి ట్రాన్స్ జెండర్ చిత్రపు పుష్పలత లయ (బీఎస్పీ) ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్నారు.
- **పరకాల** నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇక్కడ ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు.
- **వర్ధన్నపేట** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో 14 మంది నిలిచారు. ఇక్కడ ఇద్దరు మహిళలు పోటీలో నిలిచారు. ఎంసీపీఐ నుంచి కొత్తపల్లి సావిత్రి, సరిగొమ్ముల స్నేహలత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **నర్సంపేట** నియోజకవర్గం నుంచి 16 మంది ఎన్నికల రణరంగంలో పోటీ పడుతున్నారు. ఇక్కడ 15 మంది పురుషులు పోటీ చేస్తుండగా, మహిళా అభ్యర్థి ఆరెల్లి లత (జన శంఖారావం) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **భూపాలపల్లి** నియోజకవర్గంలో మొత్తం 23 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ఐదుగురు మహిళలు బరిలో ఉన్నారు. చందుపట్ల కీర్తిరెడ్డి (బీజేపీ), రత్నం పోశమ్మ (సోషల్ జస్టిస్ పార్టీ), అడ్లకొండ స్రవంతి (అబాద్ పార్టీ), మహమ్మద్ ఆస్రఫ్ (ఎంసీపీఐ-యూ) గోపిదాస్ రజని(స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **ములుగు** నియోజకవర్గం నుంచి మొత్తం 11 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ముగ్గురు మహిళలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బడే నాగజ్యోతి (బీఆర్ఎస్), ధనసరి అనసూర్య (సీతక్క) (కాంగ్రెస్), వజ్జ సమ్మక్క (స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **మహబూబాబాద్** నియోజకవర్గం నుంచి మొత్తం 12 మంది ఎన్నికల బరిలో ఉండగా భట్టు భిన్నమ్మ (స్వతంత్ర) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **డోర్నకల్** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో మొత్తం 14 మంది ఉన్నారు. ఇందులో ఇద్దరు మహిళలు పోటీ చేస్తున్నారు. భూక్యా సంగీత (బీజేపీ), గుగులోత్ పార్వతి (బీఎస్పీ) పోటీలో ఉన్నారు.
- **పాలకుర్తి** నియోజకవర్గం నుంచి మొత్తం 15 మంది ఎన్నికల బరిలో నిలిచారు. మామిడాల యశస్విని (కాంగ్రెస్) ఒక్కరే మహిళా అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **జనగామ** నియోజక వర్గంలో మొత్తం 19 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో ఒక్కరు మాత్రమే మహిళా అభ్యర్థి ఉన్నారు. జంగా సుజాత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు.
- **స్టేషన్ ఘన్‌పూర్** నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ ముగ్గురు మహిళలు పోటీ చేస్తున్నారు. సింగాపురం ఇందిర (కాంగ్రెస్), చిలుక వర్ష, కుర్సపల్లి నవ్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

కోడ్ ఉల్లంఘన.. కేసు నమోదు

నర్సింహులపేట: బీజేపీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా సంగీత ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్వామి వివేకానందా విగ్రహ ప్రహరీ, కరెంట్ స్తంభాలకు అభ్యర్థి ప్రచార పోస్టర్ అంటించారు. ప్రచారాలకు ప్రభుత్వ ఆస్తులను వాడుకోవడంతో పలువురు యువకులు శనివారం గమనించి సీ–వీజిల్ ఎల్ ఐడీ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎన్నికల అధికారి కేశవ రావు, ఎఫ్ఎస్‌టీ టీం అధికారి రాజలింగం ఘటనా స్థలిని పరిశీలించారు. రుజువు కావడంతో బీజేపీ అభ్యర్థి సంగీతపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు.

యువకుడి మృతి

ములుగు రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పత్తిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పోరిక సురేష్ (25) తన తల్లి ఇంట్లో దుస్తులు ఉతికి తీగెపై ఆరేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. తల్లిని రక్షించే క్రమంలో సురేష్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరు స్పృహ కోల్పోయారు. కొంత సమయం తర్వాత తల్లి తేరుకుంది. సురేష్ తేరుకోకపోవడంతో గమనించిన కుటుంబీకులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. సురేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

మాది సంక్షేమం.. వారిది సంక్షోభం: ఎమ్మెల్యే హరిప్రియ




కామేపల్లి : ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ, ఇల్లెందు: ప్రచారం చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, నాయకులు

కామేపల్లి: సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ పాలన కొనసాగుతుండగా.. ప్రతిపక్షాలు సంక్షోభం సృష్టించేందుకు కుట్ర పన్నారని ఇల్లెందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియనాయక్ విమర్శించారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తనను మరోమారు కోరారు. కేసీఆర్ ఆశీస్సులు, ప్రజలు బలంతో ఇంకోసారి విజయం సాధిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా తిష్ట వేసి ఉన్న సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. కరోనా కష్ట కాలంలో ముఖం చాటేసిన నాయకులు ఇప్పుడు ఓట్ల కోసం గ్రామాల బాట పట్టారని విమర్శించారు. గ్లోబల్ ప్రచారం చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని హరిప్రియ కోరారు. అనంతరం జాస్తిపల్లిలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు హరిప్రియ సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరగా, పింజర మడుగులో లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, ఎంపీపీ బానోత్ సునీతతో పాటు గుగులోత్ సునీత, మల్లెంపాటి నర్సింహారావు, గుగులోత్ దేవి, అచ్చమ్మ, కేళోత్ భాస్కర్‌నాయక్, నూతలపాటి మధు, గుజ్జర్లపూడి సతీష్, సత్యం, శెట్టి శ్రీనివాసరావు, సంతోషరావు, పుచ్చకాయల బాబు, గుగులోత్ సుందర్, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, వడియాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యం..

ఇల్లెందు/ఇల్లెందు రూరల్/బయ్యారం: పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌తో కలిసి ఆయన ఇల్లెందులోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్లు కటకం పద్మావతి, వాంకుడోతు తారతోపాటు యాకూబ్, అజయ్, సాతెల్ల గిరి తదితరులు ఉన్నారు. అలాగే, మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమ ఆధ్వర్యాన 8వ వార్డులో హరిప్రియను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బీఆర్‌ఎస్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, మళ్లీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్ష, డు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుకతోపాటు దాస్యం ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో కూడా హరిప్రియను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

ఇందిరమ్మ రాజ్యం వస్తేనే అభివృద్ధి: కాంగ్రెస్ అభ్యర్థి కోరం



ఇల్లెందు: కాంగ్రెస్‌లో చేరిన వారితో కోరం కనకయ్య, నాయకులు



గార్ల: ప్రచారంలో భాగంగా టీ కాస్తున్న కనకయ్య

ఇల్లెందు: దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన కాంగ్రెస్ ఆధ్వర్యాన ఇందిరమ్మ రాజ్యం ఏర్పడితేనే తెలంగాణ అన్నివిధాలుగా అభివృద్ధి సాధిస్తుందని జెడ్పీ చైర్మన్, ఇల్లెందు కాంగ్రెస్ ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. తాము అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు జరగవని, బంధుప్రీతి ఉండదని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు యదళ్లపల్లి అనసూర్య, రమేష్ చంద్రగుప్తతో కలిసి కనకయ్య శనివారం ఇల్లెందులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏ వర్గాన్ని కూడా సంతృప్తి కలిగించని ప్రస్తుత పాలకులను సాగనంపే సమయం ఆసన్నమైందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని తెలిపారు. నాయకులు ఎస్.కే.జానీ, డానియేల్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, పెద్దినేని హరినాథ్‌బాబు, కౌన్సిలర్ వారా రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, పలు వార్డుల్లో కాంగ్రెస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, స్వరూప బేబీ తదితరులు ప్రచారం చేశారు.

టేకులపల్లి, గార్ల మండలాల్లో..

టేకులపల్లి/గార్ల/బయ్యారం: ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య టేకులపల్లి, గార్ల మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసిన ఆయన ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనకబాటుకు గురైందని, తాము అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎంపీటీసీ ఊకె రామకృష్ణ ఆధ్వర్యాన పలువురు కోరం సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు బానోత్ సుజాత, భూక్యా దేవా, ఉండేటి ప్రసాద్, మాడే మధు, పూనెం ఉమ, సురేందర్, బోడా నిరోషా, అజ్మీరా బుజ్జి, ఎదళ్లపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు. ఇక గార్ల మండల కేంద్రంలో ప్రచారం చేసిన కనకయ్య... నెహ్రూసెంటర్‌లో హోటల్‌లో టీ కాచి ప్రజలను ఓటు అభ్యర్థించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..

ఇల్లెందురూరల్/బయ్యారం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ కుటుంబానికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, సర్పంచ్‌లు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అందరికీ అందాయని గుర్తు చేశారు. మరోమారు తమ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు కిన్నెర నర్సయ్య, తాటి రాంబాబు, మండల రాము, పూనెం సురేందర్, మోకాళ్ల వెంకటమ్మ, కల్తి పద్మ, పాయం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇక బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో కనకయ్యను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు.